# నెమళ్ల అడవి

● శ్రీపతి ● చిత్రాలు: ఎస్.ఎస్. రిమ్‌జాన్

చెరకు తోటల మధ్యనించి ''మేష్టరుగారండీ'' అని పిలుపు. కీ....కీ....కీ...అని పలుకుతూ తననే పిలుస్తున్నట్టుగా ఓ అడవిపిట్ట తలమీంచి ఎగిరిపోయింది.

ఆ పిలిచింది సత్యమే. వెతుకుతున్న నా చూపులకు పొడుగ్గా పెరిగిన చెరకుతోటలు ఆకుపచ్చ అందాలతో సాయంకాలపు గాలుల్లో తలలూపుతూ కనిపిస్తున్నాయే తప్ప, సత్యం జాడ మాత్రం లేదు. చుట్టూ చూస్తే ఓ వేపు మామిడి తోటలు. అవి దాటితే కెరటాల్లా, వరసలు వరసలుగా దూరమవుతున్న కొద్దీ నీలం మెరపెక్కుతున్న కొండలు.

కొంతసేపటికి నవ్వు ముఖంతో, చేతిలో కొడవలితో, రెండు చెరకు పొలాల మధ్య గట్టుమీంచి బైటపడ్డాడు — ఆరడుగుల రైతుబిడ్డ సత్యం.

నవర ఊళ్ళు చూడాలని పడమరగా ఉన్న కొండల వేపు వెళ్ళి, ఒంటరిని కావడంవల్ల, రోడ్డు దిగి కాలి దారిన లోతట్టున ఉండే నవర ఊళ్ళల్లోకి, మీదపడి కరచే కుక్కల భయంతో వెళ్ళలేక తిరిగి వచ్చేస్తున్న నాకు సత్యం కనిపించడంతో అడవిని గెలిచినంత ధైర్యం చిక్కింది.

సత్యంని చూస్తే నెమళ్ళ అడవి గుర్తొస్తుంది నాకు. నన్ను చూస్తే సత్యానికి జాబిల్లిపేట గుర్తొస్తుంది. మళ్ళీ ఇప్పుడు అడుగుతాడు 'ఎప్పుడెళ్తారండీ' అని. ప్రయాణం వాయిదా వేసుకోవటానికి నాకున్న ఇబ్బందులతో సత్యానికి పనిలేదు.

''సత్యం నీ గడ్డిమోపు తయారయినట్టుందికదా. నెమళ్ళ అడవికి ఇవేళ వెళ్ళాలి మనం. చాలా పొద్దుంది'' అన్నాను పడమటి ఆకాశంలో కొండల మీది పొద్దును చూసి.

సత్యం లేకుండా ఆ కొండ అడవుల్లో అడుగుపెట్టడం ప్రమాదం. ముందు ఆ అడవిదార్లు తెలీవు నాకు. వెళ్ళిన ప్రతిసారీ కొత్తగానే ఉంటాయాదార్లు. ఆ అడవుల్లో సింహాలు, పులులు, చిరుతపులులు, చివరికి ఎలుగ్గొడ్డులు సైతం అంతరించిపోయాయి. అయితే, తోడేళ్ళూ, దుమ్మల గొండులూ ఉన్నాయి. అవి చాలు నా ప్రాణాలకి.

పడమటి కొండల మధ్యనించి వచ్చే రోడ్డు ఇక్కడ ఉత్తర దక్షిణాలుగా పోతున్న రోడ్డును కలుస్తుంది. నెమళ్ళ అడవికి మేము పోవాలంటే ఉత్తరంగా దాదాపు ఓ కిలోమీటరు దూరం రోడ్డంబడి నడచి కుడివైపు అడవిలోకి దిగాలి. దార్లో ఒక గెడ్డ, రెండు మూడు గోర్జీలు, వంతర్లు దాటాలి.

పడమటి ఆకాశంలో వాలుతున్న పొద్దువేపు చూసి 'సరే' అన్నాడు సత్యం. చేతిలోని కొడవలిని తన గడ్డిమోపు ఉన్న గట్టువైపు విసిరేశాడు.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. ఎప్పుడన్నా బస్సు లేదా లారీ తప్ప, ఇతర వాహనాల రాకపోకలు ఆ రోడ్డు మీద చాలా తక్కువ.

అవే చివరి చెరకు తోటలు. అవి దాటితే మెట్ట భూములు. వాటిలో చెదురు మదురుగా మామిడి తోటలు. ఆ తోటలు దాటితే ముండ్ల పొదలతో పచ్చటి చిట్టడివి.

బాగా లోపలికి వెళ్తే అడవి చెట్లు మొదలవుతాయి.

మేము వెళ్ళాలనుకున్న నెమళ్ళ అడవికి చేరుకునే సమయానికి పొద్దుకుంకే వేళ అవుతుంది. మేతకు వెళ్ళిన నెమళ్ళు తిరిగి వాటి ఆశ్రయాలకి సరిగ్గా ఆ సమయంలోనే చేరుకుంటాయి. అవి వచ్చే దృశ్యం చూడాలి. కొమ్మ మీంచి కొమ్మకు ఎగురుతూ, పదడుగులు నేల మీద నడుస్తూ, చెట్టు మీంచి చెట్టుకు ఎగురుతూ నాలుగు వైపుల నుంచీ వస్తాయి. గూళ్ళకు చేరు కుంటున్న ఆనందంతో ఆడుకుంటూ ఆడుకుంటూ వచ్చేవాటిని చూడడం అరుదైన భాగ్యం.

ఇట్లా నెమళ్ళు ఉన్న అడవి ఒకటి ఈ ఊరుకు ఇంత చేరువలో ఉన్నట్టు ఇక్కడకు వచ్చిన దాదాపు ఏడాదికిగాని నాకు తెలీలేదు. ఆ తెలుసుకోవడం అనుకోకుండా తటస్థించింది. కడుపునొప్పి, వాంతులు ఒకటి రెండేళ్ళుగా నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. అల్లోపతి వైద్యం పని చెయ్యలేదు. నా బాధ చూసి నవర ఊళ్ళో ఒక ముసలాయన ఆకుపసరు మందు ఇస్తాడని సత్యం నన్ను ఆ నవర ఊరు తీసుకుపోయి, మందు తీసుకుని మేము వెనక్కి వస్తోంటే దారి కడ్డంగా చెట్ల తుప్పల్లో ఆడ నెమలి పిట్ట కనిపించింది.

''సత్యం! నెమలేనా?''

కొత్త లోకంలో పొరపాటున అడుగుపెట్టినట్టు నా కండ్లను నేనే నమ్మలేకపోయాను.

''నెమలి! నెమలే!''

అక్కణ్ణించి కదల్లేకపోయాను.

''ఇక్కడ నెమళ్ళు ఉంటాయని ఊళ్ళో ఎవరూ చెప్పరేం?''

నా ఉద్దేశం ఏమిటంటే అదో వార్త కావలసింది కొత్తవాళ్ళకు. అదో పెద్ద వినోద పర్యాటకమైన ఆకర్షణ కావలసింది. ఆ నెమళ్ళ అడవిని చూట్టానికి జనం కార్లల్లో, బస్సుల్లో మున్నూటరవై రోజులు తండోపతండాలుగా రావలసింది. ఆ ఊరు ఒక పర్యాటక కేంద్రం కావలసింది. పర్యావరణ విద్యా విషయాలను ప్రచారం చేసే బృందాలు అక్కడ తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సింది. అందాల దీవిగా ఆ అడవికి కనీసం రాష్ట్ర స్థాయిలోనన్నా కీర్తి ప్రశంసలు రావాల్సింది. పర్యాటకుల కోసం ఇక్కడ ఎన్నో సదుపాయాలు, విశ్రాంతి భవనాలు, హోటళ్ళు కార్లు, గుర్రపు బళ్ళు సహాయకులు, ఫోటో స్టూడియోలు, ఫోటోగ్రాఫర్‌లు, వర్తకులు, పుస్తకాల షాపులు, పక్షుల చరిత్రలతో, వర్ణచిత్రాలతో పుస్తకాలు పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దుకోగల సంపన్న సహజ వనరులన్నీ ఉన్న ఊరది.

ప్రకృతి రమణీయమైన ఇంత అపురూపమైన అందాన్ని సైతం పట్టించుకోని ఆ జనం అంధత్వం పట్ల ఆగ్రహం, అసహనం సహజంగానే కల్లోలపరచాయి నన్ను.

'సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నీలం ఆకాశం, రంగు రంగుల మేఘాలు, వర్షాలు, ఉదయాస్తమయాలు, కొండ శిఖరాలు, నదీప్రవాహాలు అన్నీ మామూలే. కొత్త విచిత్రం అందులో ఏముంది? అడవుల్లో నెమళ్ళు ఉండక కోళ్ళుంటాయా' అన్నట్టు తిక్కమనిషిని చూసినట్టు నావైపు చిత్రంగా చూశాడు సత్యం.

పదేళ్ళ కిందటి వరకు అక్కడ నెమళ్ళను వేటాడేవాళ్ళట ఆ ఊరు దొరలు. నెమలిని జాతీయ విహంగంగా ప్రభుత్వం ప్రకటించిన తర్వాత అటవీ అధికారులు కట్టుబాట్లు చేసి, కొంతమందిని కఠినంగా శిక్షించి, జుల్మానాలు విధించి భయ పెట్టడంతో నెమళ్ళ వేట అక్కడ తగ్గిందట. అయిదారేళ్ళ కిందట కొత్తగా ఉద్యోగంలో చేరిన కుర్ర అటవీ అధికారి ఆ చుట్టుపక్కల గ్రామాలలో కాలి నడకన తిరిగి, గ్రామ పెద్దలతో మాట్లాడి, నెమళ్ళను కాపాడి పెంచే బాధ్యతను



వాళ్ళకే అప్పజెప్పడంతో ఇప్పుడు నెమళ్ళజోలికి ఎవరూ పోవడం లేదట. దాంతో ఈ అడవిలో నెమళ్ళు మరో రెండుమూడు చోట్ల ఇప్పుడు కనిపిస్తున్నాయట.

రోడ్డు దిగి, గెడ్డ దాటి, గట్టెక్కి, రేగు చెట్ల మధ్య నుంచి, చీవురు తుప్పలను దాటుకుంటూ, వరిగముళ్ళ కంపలను తప్పించుకుంటూ అడ్డదారిన నత్యం తీసుకుపోతున్నాడు. పాదాలకు చెప్పులు లేకున్నా నత్యం వెతుక్కోకుండా నడుస్తున్నాడు. చెప్పులున్నా ముళ్ళు గుచ్చుకుంటున్నాయి నాకు.

"జాబిల్లి పేట ఎప్పుడెల్తారు మేష్టరుగారండీ?"

దాదాపు మూడు మాసాలుగా నత్యం అడుగుతున్నాడు ఇదే ప్రశ్నని.

నత్యం అత్తగారి ఊరది. ఇక్కడకు నలభై కిలోమీటర్ల దూరం. పెళ్ళయిన కొత్తలో పెళ్ళాం ఒక నెల దినాలపాటు కాపురం చేసి కన్నవారింటికి వెళ్ళింది. తిరిగి రాలేదు. నాలుగేళ్ళయింది కిందటి శివరాత్రికి. అన్న వదిన వెళ్ళి పిలిచారు పంపించమని. రాలేదు. చిన్నమ్మ, చిన్నాయన వెళ్ళి పిలువు చేశారు. పంపించ లేదు. ఊరు పెద్దలు కలగజేసుకున్నారు. అయినా ఫలితం లేదు. ఇప్పుడు నత్యం నా నుంచి కోరుతున్న నహాయం — ఆ ఊరెళ్ళి అక్కడ వాళ్ళ అత్తతో, పెళ్ళాంతో మాట్లాడి, వాళ్ళకు నచ్చజెప్పి, ఆ పిల్లను కావరానికి పంపించేట్టు చూడమని. నేను నచ్చజెప్తే నత్యం పెళ్ళాం ముత్యాలు వినుకుంటుందని నత్యంకి నా మీద నమ్మకం.

ఆ ఊళ్ళో నా తొలి స్నేహితుడు నత్యం. దాదావు ఏడాది కిందట ఓ వర్షపు ఉదయాన, నా తొలి ఉద్యోగంలో చేరటానికి కొండల మధ్య ఈ ఊళ్ళో అడుగు పెట్టినప్పుడు బస్ దిగిన చోట వండా టీకొట్టు ముందు నత్యమే నా సూట్‌కేస్ అందుకుని ఆ మునురు వానలో ప్రధానోపాధ్యాయులు గోదావరి రాజుగారింటికి నన్ను తీసుకుని వెళ్ళింది. బస్టాండ్‌కీ, ఆ ఊళ్ళో ఆ ఏడాదే కొత్తగా పెట్టిన ఉన్నత పాఠశాలకీ మధ్య ఓ కిలోమీటరు దూరం ఉంటుంది. చెరువుగట్టు మీంచి వెడితే ఊరు. పెద్దదే. ఊరు దాటితే వడమరగా విసిరేసినట్టు అంతదూరంలో ఈ కొత్త బడి.

నత్యంని చిన్నరైతు అనేకంటే రైతుకూలీ అనటం నరయినది. ఇద్దరన్నదమ్ములకు ఉమ్మడిగా రెండెకరాల పొలం ఉన్నా ఇంటి పెత్తనమంతా అన్నదే. నత్యం తమ్ముడన్న మాటే గానీ అన్న నత్యంని వనివాడిలా చూసేవాడు తప్పించి, తమ్ముడిలా చూసేవాడు కాదు. బీడీలకు పైనలు కావాలన్నా అన్నను అడుక్కోవలసిందే తప్ప సొంతానికి నత్యం చేతిలో ఒక రూపాయి కూడా ఉండేది కాదు. ఊళ్ళో కూలికి వ్యవసాయపు వనులు ఏమన్నా చేస్తే ఆ పైనలు అన్న చేతిలో పెట్టాల్సిందే. అన్నకు లెక్కచెప్పాల్సిందే. నత్యం వరిస్థితి చూసినప్పుడు ఆ పేదరికానికి, ప్రేమానురాగాలు లేని అన్నదమ్ముల రక్తనంబంధానికి దిగులు పుట్టేది. పోతే ఆ అన్న బావున్నాడా అంటే వాడూ అంతే. ఊళ్ళో టైలర్ కుట్టిన నేత బట్ట బనియనూ, వంచెకట్టూ, భుజాన మాసిపోయిన తువ్వాలూ, చినిగిపోయిన బట్టలూ, పెరిగిన గెడ్డమూ మీసాలూ, భుజాల మీద వడే నూనె ఎరగని జుత్తూ. తిండి గడవడం వాళ్ళకు కష్టంగానే ఉంటున్నదనిపిస్తుంది.

జాబిల్లిపేట నాకు కొత్త. తెలిసిన వాళ్ళు ఎవరూ ఆ ఊళ్ళో లేరు. కులం చొరవ తీసుకుందామంటే మా ఇద్దరిదీ ఒక కులం కాదు. పెద్దలు, బంధువులు, కుల వంచాయతీలో తేల్చుకోవాల్సిన నమన్య అది. ఆ ముడులు విప్పడం నాకు తెలీదు. అయితే, నా మీద నత్యంకి గురి. నేను తలచుకుంటే వని జరిగి తీరుతుందని. నా చిన్న వయస్సు, అల్పమైన శరీరం నన్ను చూసి కుర్ర వెధవ అనుకుంటారే తప్ప పెద్దమనిషిగా చూడరు. అదీ జంకు.

నత్యం నమస్యావరిష్కారం నాకు ఒకంతట కొరుకుడు పడటం లేదు. ఆ జాబిల్లిపేటలో అడుగుపెట్టటానికి నమయం అనుకూలించడం లేదు. నేను వెళ్ళి రాయబారం చేసినా ముత్యాలు రాదు. నాకన్నా కావలసిన పెద్దలే వెళ్ళారు. వచ్చిందా! ఆ ఊళ్ళో ఉన్నత పాఠశాల ఒకటి ఉంది. ఈ జిల్లాలో మొట్టమొదటి నాలుగు ఉన్నత పాఠశాలల్లో అది ఒకటి అని పేరువడ్డది. అక్కడ తోటి ఉపాధ్యాయులతో వరిచయం చేసుకోవచ్చు. అట్లా వెళ్ళవచ్చులే అనుకుంటే అదే బడిలో వనిచేస్తున్న వంతులుతోనే ఈ ముత్యాలుకు మంచయిందనీ, అందుకే ఆ పిల్ల కాపురానికి రావడం లేదనీ ఓ కథ వినబడుతున్నది. దగ్గర్లో వెళ్ళాలనుకుంటున్నాను. ఈ చిక్కు విడుతుందని కాదు. ఆ పిల్లను చూడాలని. ఆమెతో మాట్లాడాలని. అపవాదులు ఎన్ని ఉన్నా నిజం ఏమిటో తెలుసుకోవాలన్న ఆనక్తి నాలో.

ప్రయత్నం ఫలిస్తుందన్న నమ్మకం కలిగితేనే తప్ప ఇలాంటి వనులను నెత్తిన వేసుకోను. అది నా స్వభావం. నత్యం విషయంలో ఏదీ అనుకూలించడం లేదు. దాంతో నా ప్రయాణం వాయిదా వడుతున్నది. నా నిస్సహాయ వరిస్థితి అది. నమయం కలసి రావాలి. దాని కోసం ఎదురుచూడాలి. ఏదీ అనుకూలించనప్పుడు మనకి ఓపిక అవసరం. అదే నేను చేస్తున్న వని. నత్యంకి అది అర్థం కావడం లేదు. అదే నా బాధ.

"నత్యం మళ్ళా పాత మాటే చెప్తున్నాననుకోకుగాని మీ కులంలో మారు మనువులున్నాయి కదా! నువ్వు విడాకులిచ్చేస్తే ఆ పిల్ల తనకు నచ్చినవాడిని చేనుకుంటుంది. నీకు నచ్చిన పిల్లను నువ్వు చేనుకోవచ్చు. ఈ ఆలోచనొక్కటే నీ నమన్యకు నర్వనమ్మతమైన వరిష్కారంగా నాకు తోస్తున్నది."

నత్యం ఒప్పుకోడు. నాకు తెలుసు. నా నలహా నత్యం పాటిస్తే ఈ వ్యవహారం ఎప్పుడో వరిష్కారమయ్యేది. తలబద్దలు కొట్టుకునే వరిస్థితి నాకు తప్పేది.

పైగా, ఆ పిల్లకు ఆ ఊళ్ళో మేష్టరుతో అక్రమ నంబంధం ఉందని, అందువల్లనే కాపురానికి మొగుడు దగ్గరకు రావటం లేదని ఊరంతా తెలిసిన విషయమే. అయినా నత్యం ఆ పిల్లనే కావాలనుకోవటం వింతగా ఉంది. ఊళ్ళల్లో ఇట్లాంటి వ్యవహారాల్లో విడాకులు తీసుకోవడం మామూలే. నాలుగేళ్ళు ఎవరూ ఆగరు. వాళ్ళ కులంలో విడాకుల తంతు రెండు వైపుల పెద్దలు కూర్చుని ఒక మాట అనుకుంటే ఆ రోజుతో తేలిపోయేదే.

కొండల్లోకి దిగిపోయాడు సూర్యుడు. కొండ నీడలో నగం అడవి మునిగిపోయింది.

నెమళ్ళ అడవికి వెళ్ళాలని మధ్యలో చాలాసార్లే అడిగాను నత్యంని. కుదరలేదు. నేనొక్కడినీ వెళ్ళే అడవి కాదది. నాకు సాయంగా వచ్చి నా కోరిక మేరకు నెమళ్ళ అడవికి తీసుకుని వెళ్ళే మరో స్నేహితుడు ఎవరూ ఆ ఊళ్ళో దొరకలేదు నాకు. మా ఉపాధ్యాయులకు బడి విడిస్తే ట్యూషన్‌లు. ఒక్కో ఇంట్లో ఒక్కో కొట్టు. కొంతమందికి వాళ్ళే ఊళ్ళో పెద్దలు కొందరితో కలిసి గౌరవనామంతో పెట్టుకున్న క్లబ్. అక్కడ ఆడేది పేకాట.



జాదం. పైసలుపెట్టి. సిగరెట్టు పొగ. బూతు జోకులు. కనీసం దినపత్రిక కూడా అక్కడ ఉండదు. ఒకరిద్దరు పంతుళ్ళు పొరుగూర్లలో కాపురాలు పెట్టారు. బడి గంట కొట్టిన వెంటనే సైకిల్ ఎక్కుతారు వాళ్ళు.

నేను ఒంటరినే. ఇవేళ కూడా ఉత్తరాలు రాలేదు. దాంతో నాకు స్నేహితుల మీద కోపం. ఉద్యోగాల కోసమని, చదువుల కోసమని, వ్యాపారాల కోసమని స్నేహితులం పొట్టచేత్తో పట్టుకుని దేశం నలుమూలలా చెదిరిపోవడంతో ఉత్తరాలే దిక్కయ్యాయి. ఢిల్లీలో ఉంటున్న ముద్దుకృష్ణ పండుగరోజుల్లో గ్రీటింగ్స్‌కి పరిమితమై పోయాడు. మా స్నేహితుల్లో అదృష్టవంతుడు వాడే. పద్దెనిమిదో ఏటనే జాతీయ కళాకారుడిగా గౌరవాలు, సన్మానాలు పొందాడు. ఢిల్లీ ఆకాశవాణిలో వయొలిన్ కళాకారుడిగా, చలనచిత్ర రంగంలో ఒకటి రెండు కళా చిత్రాలకు సంగీత దర్శకుడిగా, ప్రపంచ దేశాలలో సాంస్కృతిక బృందాలతో పర్యటనలు, కచ్చేరీలు, పత్రికల్లో ఇంటర్వ్యూలు, ప్రశంసాత్మక పరిచయ వ్యాసాలు - మూడేళ్ళయింది ఇటు రాక. కిందటిసారి ఊరు వెళ్ళినప్పుడు వాళ్ళమ్మగారు కన్నీరు పెట్టుకున్నారు. పెళ్ళి చేసుకోకుండా ఎన్నాళ్ళు ఉంటాడని ఆమె బాధ. ఆ సంగతే ఉత్తరం రాసి, వెంటనే జవాబు రాయమంటే రెండు వారాలవుతోంది. జవాబు లేదు. కలిస్తే ప్రాణం పెట్టే స్నేహ హృదయం. విడిపోతే మరచిపోతాడేమో! హైదరాబాద్‌లో ఇంగ్లీషు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా శిరోమణి, డూన్‌లో ఇంగ్లీషు మేష్టరుగా రామారావు, ఝాన్సీలో కృష్ణన్నయ్య, శ్రీనగర్‌లో రక్షణ శాఖలో గురుమూర్తి, బొంబేలో టెలిఫోన్స్‌లో వెంకటరత్నం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రమణమూర్తి, గౌహతిలో ఇంజనీర్ సుబ్బారావు — అందరూ మరచిపోయారు. ఉత్తరాలు లేవు. సెలవు రోజు. ఉత్తరాల్లేకపోయేసరికి సాయంత్రం మూడుకే బయటపడ్డాను. కొండల వైపు పోయి రావాలని.

సత్యం లేకపోతే ఆ కొండలు నాకు దుర్భేద్యాలయి పోతాయి. నేను కావాలనుకున్నప్పుడల్లా సత్యంకి కుదరదు. నెమళ్ళ అడవిని రెండోసారి చూడటానికి మళ్ళీ పడలేదు. ఇవేళ చివరికి ఆ అవకాశం చిక్కింది.

మా పక్క వేపచెట్టు మీద రామచిలకలు ఆడు కుంటున్నాయి. దాన్ని 'చిలకల చెట్టు' అంటాడు సత్యం. దార్లో అదో కొండ గుర్తు మాకు. అది దాటితే మరో పది నిమిషాల నడక. రెండో కొండ గుర్తు రాళ్ళ గుట్ట. అది దాటి మరో పది నిమిషాలు నడిస్తే దిగుడు లోయ.

ఒక పాము జర్రున మా ముందునుంచే ఒక పొద నుంచి మరో పొదలోకి జారిపోయింది. సత్యం నన్ను పట్టుకుని ముందుకు అడుగు కదలనివ్వలేదు. చప్పుడు చెయ్యొద్దని నోటి మీద వేలు పెట్టాడు. ఇదే సత్యం అవసరం. పక్కన సత్యం ఉంటే అడవి భయం ఉండదు.

రాతి గుట్ట సమీపించాము. పొడుగాటి తాటిచెట్టు ఎత్తున శివలింగం ఆకారాల్లో నల్లనల్లని పెద్ద బండలు. పది పన్నెండుంటాయేమో. ఒకే చోట, ఒక కుటుంబం లాగ. మళ్ళీ ఆ దగ్గర్లో ఎక్కడా కొండరాళ్ళు కనిపించవు. వాటి దగ్గర్లో వెదురుపొదలు. ఆ రాళ్ళు ఎంతటి అందమో. కళాకారులు, ఛాయాగ్రాహకులు వాటిని చూస్తే అక్కడినించి కదలగలరా అనిపిస్తుంది. సత్యంకి వాటిల్లో కూడా అందం కనిపించదు.

రాళ్ళ గుట్ట దాటితే దిగుడు. ఆ తోపలోనే నెమళ్ళు ఉండేది. అది 'దాటి ఇంకొంచెం దూరం పోతే పెద్ద అడవి కోనేరు. అక్కడ రకరకాల, రంగు రంగుల నీటి పక్షులు. అక్కడ సవరలు ఏడాదికోసారి చైత్రమాసంలో అడవి దేవత పండుగ చేసుకుంటారు.

ఒక్కసారి వెలుగంతా మాయమై మా కండ్లకు మబ్బులు కమ్మినట్టయి పైకి ఆకాశం వైపు చూస్తే పడమటి ఆకాశంలో దట్టమైన నల్లటి వర్షపు మేఘాలు ఇంతింతై ముందుకు చొచ్చుకువస్తున్నాయి, ఆకాశాన్ని మొత్తం ఆక్రమించేసు కుంటున్నట్టు. కుండపోతగా వర్షం కురిసేట్టుంది. మేము వెనక్కి పరుగు పరుగున పోయినా ఇరవై నిమిషాలు పడుతుంది. ఎక్కడా తలదాచుకునేట్టు లేదు. మాకు నెమళ్ళ దృష్టిపోయింది. ఆకాశంలో ముసురుకు వస్తున్న నెమళ్ళ దండు మీది మీదికి తరుముకు వస్తున్నట్టుంది.

తిరుగుముఖం పట్టి పరుగు.

వర్షం అర్ధగంట సేపు పైన కొండల్లో పడితే చాలు గెడ్డ పొంగుతుంది. అది పొంగక ముందు మేము గెడ్డ దాటెయ్యాలి. లేదా అడవిలో చిక్కుకు పోయినట్టే. ఇంకోదారి లేదు. ఈ గెడ్డ పొంగడం చేతనే మేము ఒకటి రెండుసార్లు ఇటు రాలేకపోయాము.

ఎక్కడో ఓ మూల వర్షం దిగింది. చల్లటి వర్షపుగాలి. మట్టి వాసన. ఆకాశాన్ని చీల్చుతూ మెరుపులు. పైన రథాలు పరుగు తీస్తున్నట్టు, కొండచరియలు విరిగి అగాధంలోకి కూలిపోతున్నట్టు ఉరుములు. వర్షపుగాలుల తాకిడికి చెలరేగిన అడవి ఆకుల వాసనలు తెరలు తెరలుగా. ప్రకృతి వికృతంగా. పరుగుతీస్తున్న కుందేళ్ళలాగ భయంతో, గెడ్డ దాటాలన్న తొందరలో.

అడవి మమ్మల్ని వెనక్కు తరిమేస్తున్నది. వర్షం వెంటాడి భయపెడుతున్నట్టుంది.

పెద్ద చినుకొకటి నా కండ్లద్దాల మీద పడి చిట్లింది.

మేఘాలను భగ్గున మండించినట్టు మరో మెరుపు. కంధిరీగలు చుట్టు ముట్టినట్టు వర్షం. పది గజాలు పరుగెత్తే లోపల తడిసిపోయాము. దారి కనిపించడం లేదు. గెడ్డ దాటే వరకు ఆగటానికి లేదు. తడిసిన బట్టలు ఒంటికి బిగుసుకున్నాయి. కండ్లలో వర్షం, నా కోసం ఆగి ఆగి పరుగెత్తుతున్నాడు సత్యం.

నా నెమళ్ళ అడవి యాత్ర, అక్కడ సత్యం పాడే పల్లె పాట ఆ వర్షానికి తడిసిపోయాయి.



అలసిపోయాను. ఎక్కడన్నా కొంతసేపు ఆగితే బావుండును. కానీ, ముందు గెడ్డ దాటాలి. అంతవరకు ఆగనిచ్చేట్టు లేదు సత్యం. ఆగకుండా పరుగెత్తుతున్నాడు.

వర్షంలో తడుస్తున్న అడవి చెట్ల రంగులు అలుక్కుపోతున్నాయి.

గెడ్డ కనిపించింది. ఒడ్డుకు చేరాము. ప్రవాహం జాడ ఇంకా లేదు. మోకాలు లోతు పాత ప్రవాహమే. అంతే. దాటిపోయాము.

అక్కడకు ఏభై గజాల దూరంలో చిక్కటి రావి చెట్టు. ఆ చెట్టు కిందికిపోయి అక్కడ ఆగి కొద్దిసేపు అలసట తీర్చుకుని - మళ్ళీ పరుగెత్తాలి. వర్షం ఇప్పుడిప్పుడే ఆగేట్టు లేదు. వర్షం వాలు దిశ తప్పించుకునేట్టు మాను చాటున నుంచున్నాం. గెడ్డదాటిపోయిన సంతోషం. ఇక ఇల్లు చేరుకున్నట్టే. వర్షం దిగ్బంధన నించి బైటపడినట్టే. అడవిని జయించినట్టే. చలి. గజగజ వణకు తున్నా ఇప్పుడు భయంలేదు. నేను ఒక్కడినే వచ్చి ఉంటేనా! ఏ దారి పట్టేవాడినో! సత్యం తోడుతో నిశ్చింత. మరొక పరుగుతో రోడ్డు చేరుకుంటాం.

అలసట తగ్గింది. మళ్ళీ కదలవచ్చు. ఈ వర్షం ఎంతసేపు ఇట్లా కురుస్తుందో, ఆగదా అని పైకి రావిచెట్టు కొమ్మలవైపు చూస్తే కింది కొమ్మల మీద నెమళ్ళజంట.

మాకు మల్లె అవి కూడా దారి మధ్యలో ఈ వర్షానికి చిక్కిపోయి ఇక్కడ ఈ చెట్టును ఆశ్రయించినట్టా? లేక ఇదే వాటి ఆశ్రయమా?

అవి మా వైపు అనుమానంగా చూస్తున్నాయి.

'వీటిని ఇక్కడ ఇప్పుడు పట్టుకుంటే.'

నాకే దుర్మార్గంగా ఉందా ఆలోచన. వాటిని పెంచుకోవటానికే కావచ్చు. వాటిని తీసుకుపోయి చంపకపోవచ్చు.

వాటిని చూసి ఆనందించాలనుకుని వచ్చినవాడినల్లా నిస్సహాయంగా అందుబాటులో అవి కనిపించేసరికి పట్టుకుని తీసుకుపోవాలనిపించడం - అంత ముద్దొస్తున్నాయవి. బరువుపింఛాన్ని మోస్తూ ఆ మగ నెమలి మెడ పొడవుగా ఓసారి సాచింది.

నా దుర్బుద్ధి వాటికి తెలిసినట్టే ఉంది. అవి పై కొమ్మల మీదికి వెళ్ళిపోయాయి. అవి పొడుస్తాయట. అడ్డుకోవటం మాటలు కాదట. సత్యం మళ్ళీ పరుగు అందుకున్నాడు. ఆ వెంట నేను. నెమళ్ళను ఆ చెట్టుకు వదిలేసి.

* * *


ఆ రోజుతో సంక్రాంతి సెలవలు మాకు మొదలెయినాయి. మా ఊరు సంక్రాంతికి వెళ్ళాలి. అయితే జీతం ఇంకా రాలేదు. రెండు మూడు రోజుల్లో వస్తుందని ఎదురు చూస్తున్నాం. జీతం అందుకుని బయల్దేరాలి. ధర్మారావు ఉత్తరం — ఈ సంక్రాంతికి మా కళామండలి కామేశ్వరరావు కొత్త నాటకం 'రైలు ప్రయాణం' వేస్తున్నారట.

ఉత్తరాలు వచ్చే వేళయింది. తపాలా సంచి రోజూ మధ్యాహ్నం పన్నెండుకు ఈ ఊర్కి వస్తుంది. నా ఉత్తరాలు ఉంటే బ్రాంచి పోస్టుమాస్టర్ విద్యార్థి నెవరినన్నా పిలిచి మందిరం దగ్గర ఉంటున్న నాకు పంపిస్తాడు.

ఆ రోజు మందిరానికి వచ్చిన భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. గది పంచలో నర్సాపూర్ వాలుకుర్చీ వేసుకుని వచ్చేపోయే భక్తులను చూడటం గొప్ప కాలక్షేపం. పూజారి నూకయ్యగారు పూజ సమయంలో పట్టు పంచె కట్టుకుంటారు. నుదుట పొడవాటి కుంకుమ బొట్టు పెట్టుకుంటారు. అంతే. ఆయన జుత్తు క్రాఫింగ్. పూర్వాశ్రమంలో ఆయన రైల్వే డ్రైవర్. ఆయన గురువుగారు దేవీ ఆరాధకుడు. ఆ గురువుగారు కూడా రైల్వే డ్రైవరే. పదవీ విరమణ తర్వాత గురువుగారు ఖరగ్‌పూర్ విడిచిపెట్టేసి స్వగ్రామం చేరుకుని, ఊరుకు దాదాపు రెండు ఫర్లాంగుల దక్షిణంగా ఈ మెట్ట మీద దేవీ మందిరాన్ని నిర్మించి పూజలు ఆరంభించారు. దాంతో ఆయన శిష్యులంతా ఈ ఊరు రావటం మొదలు పెట్టారు. గురు శుశ్రూష కోసం ఆ రకంగా వచ్చిన నూకయ్యగారు గురువుగారు కాలధర్మం చెందిన తర్వాత దేవీపూజలు కొనసాగించి పూజారయ్యారు.

ఆయన చిరునవ్వు, దేవీ ప్రసన్న వదనం భక్తులను ఆకర్షించాయి.

ఆరేడు నెలలుగా ఇక్కడ నూకయ్యగారితో నేను ఉండటంతో చాలామంది ఇరుగు పొరుగు గ్రామాల భక్తులకు సైతం నేను పరిచితుణ్ణయ్యాను. వాళ్ళు పలకరించి మరీ వెళ్తారు. అట్లా ఓ భక్తునితో మాట్లాడుతూ ఉండగా ఆరో తరగతి విద్యార్థి ఒకడు పరుగు పరుగున వచ్చి రెండు ఉత్తరాలు నా చేతిలో పెట్టి మళ్ళీ వెళ్ళిపోయాడు. రెండూ ఇన్‌లెండ్ ఉత్తరాలే. ఒకటి విఠల్ నుంచి.



ఇక్కడ జిల్లా పరిషత్ వాళ్ళు కొత్తగా పెట్టిన ఈ ఉన్నత పాఠశాలలో నాకు బి.ఇడి శిక్షణ ముగిసిన వెంటనే ఉద్యోగం దొరికిందంటే అది విఠల్ చలవే. ఆ సంస్థలో ఉద్యోగిగా తన పలుకుబడిని ఉపయోగించి చేసిన సహాయమే. మొదట్లో ఈ ఊరు రావడం నాకు ఇష్టం లేదు. వేరే ఏ ఊరన్నా సంతోషంగా వెళ్ళేవాడినే. ఇది మన్యం ప్రాంతమనీ, దోమకాటు, చలిజ్వరాలతో మనుషులు చచ్చిపోతున్నారనీ, చలికాలం ఎముకలు కొరికే చలనీ, ఎండాకాలం నిప్పులు చెరిగే ఎండలనీ భయపెట్టారు. ఊరు మార్పు కావాలని పోయి విఠల్‌తో మాట్లాట్లానికి వెడితే ఆయన చాలాసేపు నవ్వి "ఆ ఊళ్ళో మనుషులు బతికే ఉన్నారు. పోయి చూసి నమ్మకం కలిగిన తర్వాతనే బడిలో చేరు" అన్నాడు. వచ్చి చూస్తే నిజమే అనిపించింది. ఆస్పత్రి కూడా ఊళ్ళో లేదు. మన్యం జ్వరాలు పాతకాలపు మాటేగాని ఇప్పటి మాట కాదు.

ఆయన రాసిన ఉత్తరం. ధర్మారావు రాసిన సంగతే. సంక్రాంతి రోజున కామేశ్వరరావు కొత్త నాటకం 'రైలు ప్రయాణం' ప్రదర్శన. దాంట్లో ఒక పాత్రలో నటిస్తున్నాడట విఠల్. తప్పనిసరిగా రమ్మని. ఆ ఉత్తరం ముగింపులో మా మిత్రులు శాస్త్రి దంపతులకు జాబిల్లిపేట బదలీ అయిందనీ, వెళ్ళి వాళ్ళు అక్కడ చేరిపోయారనీ తెలియజేశారు.

కాలమే కొన్ని సమస్యలను పరిష్కరిస్తుందంటారు. ఇప్పుడు నాకు అదే అనిపించింది. సత్యం సమస్యకు పరిష్కారం దొరికినంత సంతోషమయింది. ఇప్పుడు ఆ ఊళ్ళో అడుగుపెట్టటానికి చోటు దొరికింది.

ఇప్పుడు ఈ సమస్య పరిష్కారభారం శాస్త్రి మీద పడేయవచ్చని ధైర్యం. మనుషుల మధ్య ఇట్లాంటి ప్రేమాభిమానాల విషయంలో శాస్త్రికి కావలసినంత చొరవ, సహాయ స్వభావం, మంచితనం ఉన్నాయి. ఓ సారి పోయి శాస్త్రితో మాట్లాడితే ఆ బాధ్యతను ఆయనకే అప్పజెప్పి రావచ్చుననుకున్నాను.

వెళ్ళాలి వెళ్ళాలి అనుకుంటూనే మరో మూడు మాసాలు గడచిపోయాయి. మధ్యలో రెండు ఉత్తరాలు రాశాను వస్తున్నట్టు. చివరి నిమిషంలో ఆటంకాల మూలంగా వెళ్ళలేకపోవడం, సంజాయిషీ రాసుకోవడం కూడా అయింది.

ఇప్పుడు వస్తున్న సంగతి ముందస్తుగా రాయకుండానే ఓ ఉదయం సెలవు రోజున పదిగంటలకల్లా జాబిల్లిపేట చేరుకున్నాను. ఇట్లాంటి ఊళ్ళల్లో ఉపాధ్యాయుల ఇల్లు వెతుక్కోవడం సమస్య కాదు. ఎవరో విద్యార్థి తీసుకుపోతాడు. నేను వెళ్ళేసరికి శాస్త్రి, సావిత్రమ్మగారు ఇంట్లోనే ఉన్నారు. సావిత్రమ్మగారు ఇంగ్లీషు దినపత్రిక చదువుతుంటున్నారు. శాస్త్రి గెడ్డం గీసుకుంటున్నాడు.

నవ్వులు, పలకరింపులు, స్నేహితుల ముచ్చట్లు, బదలీలు, కాఫీలు, ట్యూషన్ ఆదాయాలు, ఊళ్ళో రాజకీయాలు అన్నీ కలబోసుకున్న తర్వాత నేను వచ్చిన పని గురించి చెప్పాను. సత్యం కథ విని ఆ ఇద్దరూ బాధపడ్డారు. సత్యం అత్తవారి ఇల్లు ఆస్పత్రి వెనుక వీధిలో, పెద్ద తులసి కోట దగ్గర్లో టైలర్ షాప్‌కు తూర్పుగా ఉన్న వివరాలు చెప్పాను.

శాస్త్రి ఇక్కడకు బదలీ అయి కూడా నాలుగు మాసాలకు పైనే అయింది కాబట్టి ఆ ఊళ్ళో ముత్యాలు అనే పిల్ల గురించి తెలిసే ఉంటుంది. తన తోటి ఉపాధ్యాయుడే కథానాయకుడు అయినప్పుడు తెలియకుండా ఉండటం అసంభవం అనిపించింది.

కలకత్తా - మద్రాసు జాతీయ రహదారికి పదిహేను కిలోమీటర్ల పడమరగా ఏటి ఒడ్డున ఉత్తరంగా ఉన్న జాబిల్లిపేట రెండు పంటలు పండే సారవంతమైన పొలాలతో సంపన్నమైన ఊరులా కనిపించింది. ఏటి సమీపాన మెట్ట మీద పురాతనమైన పెద్ద రాతి దేవాలయం, దానికి ఓ అర కిలోమీటరు దూరంలో పూర్వపు జమీందార్లు కట్టించిన పాతకాలపు కట్టడం. పాఠశాల భవనం కనిపించాయి.

దేవాలయం రాతి ప్రహరీగోడ రెండు మూడు చోట్ల కూలిపోయి, గ్రామస్థుల నిరాదరణకు గురయినట్టు కనిపిస్తున్నది. పాఠశాల భవనం ఇటుక గోడలు పగుళ్ళతో కూలటానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. ఆ ఊళ్ళో మనుషుల ముఖాలు కొన్ని కక్షాకార్పణ్యాలతో దహించుకుపోతున్నట్టూ, మరికొన్ని ముఖాలు కుట్రలతో కుహకాలతో సలసల ఉడికిపోతున్నట్టూ, ఇంకొన్ని ముఖాలు ఈ బతుకు జూదంలో ఓడిపోయి చితికిపోయినట్టూ కనిపించి మనసులో జంకు పుట్టింది నాకు.

ఎండాకాలం మొదలుకావడంతో ఏరు ఆ ఒడ్డున సన్నటిపాయగా పారుతున్నది. అక్కడకు పోయి చెలమల్లోంచి నీళ్ళు తోడుకుని బిందెల్లో, మట్టి కడవల్లో నింపుకుని ఆ ఊరు ఆడపడుచులు తెచ్చుకుంటున్నారు.

'ఈ పాఠశాల, ఈ దేవాలయం ఇట్లా ఉన్నాయేం?' అని అడిగితే, దేవాలయ భూముల్ని ధర్మకర్తలు తినేస్తున్నారనీ, ఊరు విడిచిపెట్టి ఇప్పుడు వాళ్ళు హైదరాబాద్‌లో ఇళ్ళు కట్టుకుని అక్కడే ఉంటున్నారనీ, పాఠశాల మరమ్మతు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన చాలీచాలని మొత్తాలని కాంట్రాక్టర్లూ, ఇంజనీర్లూ, ఆఫీస్ ఉద్యోగులూ వాటా పంచుకుంటున్నారని శాస్త్రి జవాబు.

"ఈ ఊళ్ళో మనుషులేమిటి ఇట్లా ఉన్నారు. ఒక నవ్వు ముఖం కనిపించలేదు."

"నా ముఖంలో కూడా నవ్వు కనిపించలేదా నీకు!" అని శాస్త్రి పరిహాసం.

"అన్ని ఊళ్ళలాగానే ఉందీ ఊరు. ఎటొచ్చీ డబ్బున్న ఊరు కాబట్టి కోర్టుల్లోనూ, ఆస్పత్రుల్లోనూ పెద్దలకు కాలక్షేపం. ఊళ్ళు ఇప్పుడు శాశ్వత శత్రు శిబిరాలుగా తయారయ్యాయి. పార్టీల పుట్టలయ్యాయి. ఏ పుట్టలో ఎన్ని పాములున్నాయో, ఏ పాము ఎప్పుడు ఎవర్ని కరుస్తుందో" అని శాస్త్రి వ్యాఖ్యానం.

చాలాసేపు ఏటి ఒడ్డున ఆ దేవాలయాన్నీ ఆ పాతకాలపు పాఠశాల భవనాన్నీ ఏరునీ చూసి తిరిగి ఇల్లు చేరుకున్న తర్వాత ఆ ఊళ్ళో ఏదో పెద్ద దోషమే ఉందనిపించింది. ఆ ఊళ్ళో దుర్మార్గం, ఉన్మాదం ఎదురులేని పెత్తనం చేస్తున్నట్టు కనిపించసాగింది.

ఆ సాయంత్రం ముత్యాలు ఇంటికి వెళ్ళి ఆ పిల్లతో మాటాడాలని నేను అన్నప్పుడు, మేము వెళ్ళడంకన్న ఆ పిల్లనే ఇంటికి పిలిపించవచ్చునని సావిత్రమ్మగారు సలహా ఇచ్చారు. అదే మాకు నచ్చింది. ఈలోపు వాళ్ళకు ఏటి నీళ్ళు తెచ్చి పోసే చిన్నమ్మకు కబురు చేశారట సావిత్రమ్మగారు. చిన్నమ్మ వస్తే మాటాడవచ్చునన్నారు.

మేము భోజనాలు చేస్తుండగా చిన్నమ్మ వచ్చింది. కాయకష్టంతో చేవతేలిన నలభై అయిదేళ్ళ చిన్నమ్మ ఆ ఊళ్ళోనే పుట్టి, ఆ ఊళ్ళోనే పెరిగి, ఆ ఊళ్ళోనే పెళ్ళి చేసుకుని, ఏటి నీళ్ళు మోసి పెద్ద రైతులకూ, మేష్టర్లకు పోస్తున్నదట. చిన్నమ్మ మొగుడు స్కూల్‌లో ప్యూన్‌ట. చాలా నమ్మకమైన మనిషి. ఏ సంగతి చెప్పినా గుట్టుగా ఉంటుందని సావిత్రమ్మగారి నమ్మకం.

చిన్నమ్మ ఆ రాత్రి తొమ్మిది గంటలప్పుడు చెప్పిన సంగతులు ఏమిటంటే, ముత్యాలు, తల్లి కాంతమ్మ ఈ ఉదయమే పొరుగూర్లో తమ బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళారని, వాళ్ళు రెండు మూడు రోజుల తర్వాతగాని రారని. ముత్యాలును చూసి, ఆమెతో మాట్లాడాలనుకున్న నాకు మరోసారి రావాల్సిన పని పడింది. ముత్యాలును కలిసే అవకాశమే లేనందువల్ల ఆ బాధ్యతని శాస్త్రి దంపతులు ఇద్దరి మీదా పెట్టి రెండో రోజు ఉదయమే తిరుగు ప్రయాణం కట్టాను.

చిన్నమ్మ చెప్పిన మాటలను బట్టి ముందు ప్రచారమైన కథలన్నీ కథలేననీ, వాటిలో నిజం లేదని రుజువయినందుకు నా మనసు తేలిక పడింది. ఆ పిల్లకు ఏ మేష్టరుతోనూ ఎప్పుడూ సంబంధం లేదట. అట్లాంటి సంబంధం ఉన్న ముత్యాలు వేరే ఉందట. అయితే, ఆ తల్లి కాంతమ్మకు మాత్రం మొగుడు బతికున్న రోజుల్లోనే ఆ ఊరుకు వచ్చిన ఒక డాక్టరుతో సంబంధం ఉండేదట. ఇప్పుడు ఆ డాక్టరు బదలీ మీద వేరే ఊరు వెళ్ళిపోయినా, అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉంటాడట. మొగుడుకు తెలిసి, చూసీ చూడనట్టు ఉండేవాడు. డాక్టర్ చాలా మంచి మనిషట.

ముత్యాలుకు పెళ్ళయిన రెండో నెల ఆ ఊరు ఏటి ఒడ్డున మెట్ట మీద శివాలయం దగ్గర జరిగిన శివరాత్రి సంబరాలకు తోటి ఆడపిల్లల జట్టుతో వెళ్ళినప్పుడు ఆ ఊరు ఎమ్మెల్యే తమ్ముడూ, వాడి స్నేహితులు నలుగురు కలిసి ముత్యాలును ఎత్తుకుపోయి, ఒక రాత్రంతా ఉంచుకుని తెల్లారి వదిలేశారట. అప్పట్నించి ఆ పిల్ల కాపురానికి మొగుడు దగ్గరకు వెళ్ళనని, తన బతుకు పాడుచేసిన ఆ అయిదుగుర్నీ ఊరు అమ్మోరు తినేసిననాడు మొగుడి దగ్గరకు కాపురానికి వెళ్ళాలనుకున్నట్టు ఒట్టు పెట్టుకున్నదట. ఆ శివరాత్రి నాడు ఆ పిల్లనెత్తుకుని పోయినవాళ్ళలో ఒకడు రెండేళ్ళ కిందట పొలంలో పాముకాటుకు చచ్చాడట. మిగిలిన నలుగురూ వాడిలాగానే చస్తారని ఆ పిల్లకి ఇప్పుడు నమ్మకం ఏర్పడిపోయింది.

ఇట్లాంటి పట్టుదల పెట్టుకున్న పిల్ల ఇంక పెనిమిటితో కాపురం ఎప్పుడు చేస్తుంది? ఇదేమైనా సత్యకాలమా, ధర్మదేవత ఆగ్రహానికి పాపాత్ములు కాలి మసైపోవడానికి! తన ఉసురు వాళ్ళకు తగులుతుందని, మరిడమ్మ వచ్చి వాళ్ళను నొల్లేస్తుందని ఆ పిల్ల మూర్ఖత్వం. పాపాత్ములే పదికాలాల పాటు బతికి దేశాన్ని ఏలుతుండటం మనం చూడటం లేదా? ఆ ఊరు ముఖమ్మీదే ఆ సత్యం కనిపిస్తున్నది కదా. ఏ కట్టెలో అగ్గి ఉంటే ఆ కట్టే కాలిపోతుందనుకుంటే ఆ అమాయకత్వాన్ని పోగొట్టడం కష్టమే. అగ్గి ఉన్న కట్టె ఊరు ఊరంతటినీ దగ్ధం చేయవచ్చు. తర్వాత అది కాలిపోతేనేం, కాలకుండా మిగిలి పోతేనేం.

జాబిల్లిపేట నించి తిరిగి వచ్చిన తర్వాత సత్యం నన్ను కలిసి అడిగినప్పుడు నా పాత సలహాలో అన్యాయం నాకర్థమై ఉన్నదున్నట్టు చెప్పాలనుకున్నాను. ముత్యాలుకు నా మూలంగా ఎలాంటి అన్యాయమూ జరగ కూడదు. ఏ దోషమూ, ఏ తప్పూ ఎరగని ఆ పిల్లను శిక్షించడం ద్రోహం.

సత్యం సమస్యను పరిష్కరించటానికి ఇంకో దారి ఉంది. 'ఇదుగో ఇదీ వాస్తవం. ఆ అయిదుగురు కీచకుల్లో ఒకడు పాము కరచి చచ్చాడు. ఇంకా నలుగురు మిగిలారు. వాళ్ళను చంపు. అప్పుడు నీ పెళ్ళాం నీ దగ్గరకు వస్తుంది. నీ పెళ్ళాం పట్టిన పట్టు అది' అని ఉన్న సంగతి ఉన్నట్టుగా చెప్పవచ్చు. సత్యం వాళ్ళను చంపనూవచ్చు. దాని ఫలితం సత్యం జైల్లో పడటమే తప్ప పెళ్ళాంతో కాపురం చేయటం మాత్రం కాదు. ఏమో ఉరిశిక్ష కూడా పడవచ్చు. నిజం సత్యానికి చెప్పడం వల్ల ఒనగూడే మేలు ఏమీ లేదు.

ఈ కారణాల మూలంగా సత్యం కలిసినప్పుడు "శాస్త్రిగారు నా స్నేహితుడు. ఆయన మీద ఈ బాధ్యత పెట్టాను. ఆయన నీ సమస్యను సులభంగానే పరిష్కరించగలుగుతాడు. ఆయన తోడ్పాటు మనకు ఉంటుంది. అయితే, నువ్వు అనుకున్నంత తొందరలో పని జరగకపోవచ్చు. ఏమో మీ పెళ్ళాం, మొగుళ్ళ రాత ఎలా ఉందో? ఆలస్యంగానన్నా నీ దగ్గరకు రావడం ఖాయం" అన్నాను, అనవసరమైన ఆశ కల్పించకూడదని.

నా మాట విని పెళ్ళాం రేపే కాపురానికి తన దగ్గరకు వస్తున్నంత సంబరపడ్డాడు సత్యం.

ఒక సంగతి నిజం. కథ ఇప్పుడు ఎక్కడ వేసినది అక్కడ లేదు. కొంత ముందుకు సాగింది.

* * *

వేసవి సెలవలు మొదలయ్యాయి. శిరోమణి చెల్లెలు సుజాత పెళ్ళి మా ఊళ్ళో ఈ మే నెల రెండవ వారంలో ఉంది. ఈ వేసవి సెలవలకు డూన్ నుంచి రామారావు, శ్రీనగర్ నుంచి గురుమూర్తి, ఝాన్సీ నుంచి కృష్ణన్నయ్య, బాంబే నుంచి వెంకటరత్నం వస్తారని ఊరు వెళ్ళే హడావిడిలో పరీక్ష పేపర్లు దిద్ది ఇచ్చేయటం, మార్కుల జాబితాలు అందజేయటం, నా క్లాస్ ప్రోగ్రెస్ కార్డులు తయారుచేయటం పనుల్లో నిండా మునిగి ఉండగా, ఓ సాయంత్రం ముద్దుకృష్ణ, ధర్మారావు, శిరోమణి, కామేశ్వరరావు వచ్చి వాలారు. బస్టాండ్ దగ్గర పండా టీ కొట్టు ముందు వాళ్ళ నలుగుర్నీ చూసి, వాళ్ళను దేవీ మందిరం దగ్గర నా గదికి తీసుకుని వచ్చింది సత్యమే. నా నెమళ్ళ అడవి ఉత్తరాలు వాళ్ళను అక్కడకు తీసుకుని వచ్చాయని వాళ్ళ భుజాలకు వేలాడుతున్న కెమేరాలను చూస్తే తెలుస్తుంది. నెమళ్ళ అడవిని వినోద పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనుకున్న నా నిర్మాణ పథకంలో తొలి వినోద పర్యాటకులుగా ఈ నలుగుర్నీ కీర్తించవచ్చు.

మా ఊరు నుంచి ఇక్కడకు మూడు గంటలు బస్ ప్రయాణం.

"చాలా చాలా అందమైన ఊర్రా సంజీవ్." పలకరింపు నవ్వుతోనే మెచ్చుకున్నాడు ముద్దుకృష్ణ. మూడేళ్ళ తర్వాత చూడటం ముద్దుకృష్ణని. వదులు టీ షర్టుతో, జీన్స్‌తో, పెంచి పోషిస్తున్న చిన్నపాటి నల్లటి దట్టమైన గడ్డంతో, మహానగరపు నాజూకు మోటుతనం ముఖాన కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

"ఘాట్ రోడ్ రెండు వైపులా పర్వతారణ్యాలూ, లోయలూ నీవు రాసిన దానికన్నా గొప్పగా ఉంది ఈ ప్రకృతి ఇక్కడ" అన్నాడు శిరోమణి. ముతక ఖద్దరు ఉదారంగు లాల్చీ, పైజామాతో, ఆకుచెప్పులతో, అలవాటైపోయిన వృత్తిపరమైన నవ్వుముఖంతో, రెండు చేతులూ బార్లా చాపి విసిరి పొగడ్తను చేతులతో ప్రదర్శించాడు, కొత్త అలవాట్లతో.

వీళ్ళిద్దరూ వయసులో నా కన్నా రెండు మూడేళ్ళు పెద్దవాళ్ళు. సహజంగా భారీ శరీరాలే అయినా, వాటిని గీత గీసి అదుపులో ఉంచినట్టు కనిపించారు. ఇద్దరూ ఈ ప్రయాణాల వల్లనో ఏమో చిక్కినట్టే ఉన్నారు.

పడమటికి ఎదురుచేసిన దేవీ మందిరానికి ఈశాన్యంగా దగ్గర్లోనే పడమటికే ఎదురుచేసిన మా రెండు గదుల పాక, మందిరానికి దక్షిణంగా పందలాది రకాల మందారాల పూలతోట, అక్కడ ఆ చుట్టూ ఉన్న ఎండాకాలపు ఖాళీ పొలాలు, అక్కడక్కడ అప్పుడే మొలకెత్తుతున్న చెరకు పొలాలు, పందగజాల దూరంలో దక్షిణ ఉత్తరాలుగా పోతున్న రోడ్డు, ఆ వెనుక వరుసలు వరుసలుగా తూర్పు కనుమల పర్వతపంక్తులు. వాటిని చూస్తూ నోట మాట రాక ఆ పంచలోని సిమెంట్ అరుగు మీద కూచున్నారు ధర్మారావు, కామేశ్వరరావు.

సముద్రపు ఒడ్డు గ్రామం నుంచి కొండల మధ్యకి రావడం వల్లనేమో ఈ కొత్త అనుభూతి. ఏడాదిన్నర కిందట ఇక్కడ నా తొలి ఉద్యోగంలో చేరటానికి వచ్చినప్పుడు దారి పొడుగునా పొంగి ప్రవహిస్తున్న సెలయేళ్ళు కాలువలు, తడుస్తున్న అడవులు, వర్షపు నీళ్ళు నిలచిన పచ్చనేల, పచ్చటి కొండలు, చేతికి అందుతున్నట్టుగా చెట్ల మీదికి వాలిన మేఘాలు. ఆ అందంతో మనసు ఉక్కిరిబిక్కిరయింది. ఆ కొత్త అందాలు నా స్నేహితుల్ని సైతం పట్టుకున్నందుకు ఇప్పుడు నాకు ఉత్సాహంగా ఉంది.

బాంబే చలనచిత్ర రంగం తనకు పడలేదట. ఢిల్లీ వచ్చి ఆకాశవాణిలో తిరిగి చేరిపోయాడట. రెండు మూడేళ్ళలో ఆ ఉద్యోగం మానుకోవాలనుకుంటున్నాడట. ఇప్పుడిప్పుడే దేశంలో మొదలయిన కొత్త సాంస్కృతిక పునర్వికాసంతో చేతి నిండా అవకాశాలున్నాయట. తను సంగీత కచ్చేరీల మీద గౌరవంగా బతకవచ్చు అంటున్నాడు ముద్దుకృష్ణ. ఆత్మవిశ్వాసం పట్టుతో మాటాడుతున్నాడు. పెళ్ళి విషయమై వాళ్ళ అమ్మగారి ఫిర్యాదుల గురించి గుర్తుచేస్తే, తన పెళ్ళి భాషాంతరమూ, రాష్ట్రాంతరమూ, ఏమో మతాంతరం కూడా కావచ్చునన్నాడు, చైతన్యానికి పరిధులు తానే శాసిస్తున్నట్టు.

తన అతిథులకు పెట్టే తిండిని బట్టి ఉంటుంది ఆ ఊరు ఘనత. తల్లిలా అభిమానంతో భోజనం పెట్టే పండా వంటలను నా స్నేహితులు ఆ రాత్రి పదే పదే స్మరించుకుంటున్నారు. పండా ఒరియా వాడన్న మాటేగానీ వండినవి ఆ పూట ఒరియా వంటకాలు కావు అంటున్నారు. మేమంతా సరిహద్దు ప్రాంతాల వాళ్ళం కాబట్టి ఒరియా రుచులు తెలిసినవాళ్ళమే. అరవయ్యేళ్ళ పండా ఆ ఊళ్ళో నాకున్న ముగ్గురు నలుగురు స్నేహితుల్లో ఒకరని నేను గొప్ప చెప్పుకుంటుంటే విస్తుపోయి నా ముఖం చూసిన ఆ మిత్రులు మా కోసం ఆ రాత్రి పెట్టిన విందు భోజనం తిని నమ్మారు. పండా నలభయ్యేళ్ళ పాటు ఒరిస్సా రాజకుటుంబాలలో, పెద్దపెద్ద జమీందారీ కుటుంబాలలో వంట మనిషిగా దేశం నలుమూలలా తిరిగి పేరుమోసినవాడు. ముసలి తల్లి కోసం అయిదేళ్ళ కిందట సొంత ఊరు వచ్చేసి కాలక్షేపానికి ఇప్పుడు టీకొట్టు నడుపుతున్నాడు. ఊళ్ళో కొత్తగా ఉన్నత పాఠశాల పెడుతున్నప్పుడు సర్పంచ్ నాయుడు "ఈ కొత్త పంతుళ్ళు కొన్నాళ్ళు మన ఊళ్ళో ఉండాలంటే వాళ్ళకు భోజన సదుపాయం ఉండాలి. నీ సహాయం అది" అని పండా దగ్గరకు వెళ్ళి

వినమ్రతాభావంతో చెప్పినప్పుడు సంతోషంగానే సరే అన్నాడు పండా. ఇప్పుడు ఆరుగురం ఉపాధ్యాయులం అక్కడ భోజనం చేస్తున్నాం.

మేము దేవీ మందిరానికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. నూకయ్యగారు ఏకతార శ్రుతిగా బ్రహ్మంగారి తత్త్వాలు పాడుకుంటున్నారు. ఆయన పడుకునే ముందు రోజూ చేసే కార్యక్రమమది. అట్లాగే వేకువజామున ఏకతార నాదం మీద బ్రహ్మంగారి తత్త్వాలు మంద్రంగా వినిపిస్తాయి. మేము రావడం చూసి ఆయన ఏకతార పక్కకు పెట్టి బయటికి వచ్చి మాతో కూర్చున్నారు. ఆ సాయంత్రం నుంచి సత్యం మాతోనే ఉన్నాడు. మా మిత్రులందరికీ వాకిట చాపలు వేసి పక్కలు ఏర్పాటు చేస్తున్నాడు సత్యం.

చెట్టుకో పిట్టలా బతుకు పరుగులో దేశమంతటా చెదిరిపోయిన మిత్రులను గుర్తు చేసుకుంటున్నాము.

"మన స్నేహితుల్లో ముందుగా మన ఊరు విడిచి వెళ్ళిపోయినవాడివి నువ్వే" అన్నాను ముద్దుకృష్ణతో. ఇంటర్మీడియట్ ముగియటంతోనే ఢిల్లీలో పడ్డాడు. అక్కడ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో వాళ్ళ చిన్నాన్న ప్రొఫెసర్. అక్కడ సంగీత విద్వాంసుల దగ్గర శిక్షణ, సంగీత కళాశాలలో చదువు మంచిదని తీసుకుపోయాడాయన.

"దేశ రాజధాని ఢిల్లీ మహానగరానికి మన ఊరు ముద్దుకృష్ణను కానుకగా బహూకరించింది" అన్నాడు, ఇప్పుడు హైదరాబాద్‌లో ఇంగ్లీషు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్న శిరోమణి. తెలుగు పండిత కుటుంబాలలో పుట్టి, ఇంగ్లీషు కలం పట్టుకున్న శిరోమణిని రాష్ట్ర రాజధానికి బహూకరించింది మా ఊరు.

"నిన్ను హైదరాబాద్‌కు విక్రయించింది మన ఊరు" అన్నాడు నవ్వుతూ కామేశ్వరరావు - మా కళా మండలి ఆస్థాన రచయిత.

శిరోమణి ఉత్తరాల నిండా మురికివాడల్లాంటి నగర సంస్కృతి మీద ఆగ్రహ విమర్శలే. కానీ, తిరిగి స్వగ్రామం వస్తే ఓ చిన్న ముద్రణాలయాన్నైనా నడుపు కోగలడా? డిగ్రీలు చదువుకున్న పాపానికి నగరాలకు అమ్ముడుపోతున్న పల్లెటూళ్ళలోని విద్యావంతుల దుఃస్థితి మీద విమర్శ అది.

"రామారావును డూన్ స్కూల్ లాక్కుంది."

"సమకాలీన ఆంగ్ల సాహిత్యంలో కనిపించే కొత్త కొత్త రచయితలను, కవులను చదివి, మాతో చదివించి, గ్రంథాలయం ముందు గంటల తరబడి చర్చలు రేకెత్తించే రామారావును డూన్‌కు పంపించేయటం కన్నా మన ఊరు దౌర్భాగ్యం ఏముంటుంది? మన ఊళ్ళోనే ఉంటే ఎంతమంది రచయితలు, కవులు వెలసే వారో కదా! ఈ అడవులూ, ఈ కొండలూ, ఈ నెమళ్ళూ ఇంత అందంగా కనిపిస్తున్నాయంటే రామారావు గుండెల్లో చల్లిన అత్తరు చల్లని స్పర్శే కారణం."

"నాటకాలు రాయటానికి ప్రేరణ రామారావే" అన్నాడు కామేశ్వరరావు. స్నేహమే అయినా, రామారావు పట్ల గురుభావం అందరికీ. 'రైలు ప్రయాణం' నాటక ప్రదర్శన రచయితకీ, దర్శకుడికీ కాకుండా నటుడు పాణిగ్రాహికి పేరు తెచ్చిందట.

మా కళామండలి వయసు మూడేళ్ళే అయినా, ధర్మారావు, కామేశ్వరరావుల పట్టుదలతో మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లడం అభినందనపాత్రమయింది. ధర్మారావు ఈమధ్య ఓసారి మద్రాసు, మరోసారి హైదరాబాద్ వెళ్ళి వచ్చాడు. చలనచిత్ర రంగం వాళ్ళను పిలుచుకుంటే ముద్దుకృష్ణ, రామారావుల సారథ్యంలో ప్రారంభమైన మా కళామండలిని నడిపించేవాళ్ళు ఎవరవుతారో అన్నది చర్చనీయాంశం అయింది. కళామండలి ప్రాభవం మూడేళ్ళతో ముగుస్తుందా? ఆంధ్రుల ఆరంభశూరత్వానికి ఉదాహరణగా చెప్పుకుంటారా?

పతంజలి పెళ్ళి ప్రస్తావన వచ్చింది.

"దగ్గర్లో ఉన్నాడన్న మాటేగాని బరంపురం వదలిరాడు పతంజలి. నేను ఈ ఊరొచ్చి ఏడాదిన్నర కావచ్చినా, ఒక్కసారి కూడా రాలేదు. ఇప్పుడాయన కరుణహృదయుడు."


"కరుణ కోసం క్రైస్తవం స్వీకరిస్తాడో లేక ఆమె తన మతం మార్చుకుంటుందో?"

"ఇద్దరూ మత స్వాతంత్ర్యాన్ని ప్రకటించవచ్చు."

రెండేళ్ళుగా నలుగుతున్న పాత కథే. చెప్పుకుని నవ్వుకున్నాం.

ఇలా మేము ముచ్చట్లలో ఉండగా మందిరానికి పడమరగా, నూతికి దిగువగా ఉన్న పంటల్లేని పొలాల నుంచి కమ్మని బృందగానం వినిపించింది.

మా మాటలూ, నవ్వులూ ఒక్కసారి ఆగిపోయాయి. ఆ గానం ముందు ముద్దుకృష్ణ చెవిలోనే పడినట్టుంది. మా చూపులు అటు వెతకసాగాయి. వెన్నెల్లో నీడల్లా ఓ గుంపు కనిపిస్తున్నది. దగ్గర్లో ఉన్న సంతకు పోతూ రాత్రిపూట సవరలు ఇక్కడ మజిలీ చేస్తారు. వాళ్ళు కొండ ఊళ్ళలో రాత్రి తిని బయల్దేరి ఉంటారు. అర్ధరాత్రి వరకు పాటలు పాడుకుని నిద్రపోయి, వేకువజామునే లేచి మళ్ళీ బయల్దేరుతారు సంతకి. తాము సంతలో అమ్ముకోవటానికి తెచ్చుకున్న వస్తువులతో నిండిన గంపలూ, కావళ్ళూ అక్కడే పెట్టుకుంటారు. వాళ్ళకు ఇక్కడున్న సదుపాయమంతా తాగటానికి నీళ్ళు ఆ నూతిలో దొరుకుతాయి. దారిన పోయే వాళ్ళ కోసం అక్కడ ఓ బకెట్ ఎప్పుడూ ఉంటుంది. అవసరమయితే పూజారి దగ్గరకు పోయి, అగ్గిపెట్టె అడుక్కుంటారు. ఈ రెండు సదుపాయాల మూలంగానే ఆ సవరజట్టుకు అది మజిలీ చోటయింది.



పొలం నుంచి పాట శ్రావ్యంగా వినిపిస్తున్నది.

ముద్దుకృష్ణ తన టేప్‌రికార్డ్‌ని బేగ్ నుంచి బయటికి తీసి వాళ్ళున్న చోటుకు వెళ్ళటానికి సిద్ధమవుతున్నాడు. శిరోమణి తన కెమేరాని సిద్ధం చేస్తున్నాడు. వెళ్ళి వాళ్ళ సమీపంలో కూచుని వినాలని తయారవుతున్నాడు కామేశ్వరరావు.

"మీరు అక్కడకు వెళ్ళేట్టయితే పాట ఆగిపోతుంది." నా అనుభవం చెప్పాను. "పాట ఆపకుండా వినాలనుకుంటే ఇక్కడ నుంచి కదలకూడదు మనం."

"వెళ్ళొద్దు" అన్నాడు సత్యం.

దాంతో ముద్దుకృష్ణ మనసు విలవిలలాడింది.

"ఆ పాటనెట్లాగన్నా రికార్డ్ చెయ్యాలి." అదీ ముద్దుకృష్ణ పట్టుదల.

సత్యం ప్రయత్నిస్తే అవుతుంది. సత్యం సహాయం కావాలి. దానికి సత్యం ఒప్పుకోవడం లేదు. ఆ పాట సగంలో వాళ్ళు ఆపేయడం సత్యంకి ఇష్టం లేదు. 'మనం వెళ్తే వాళ్ళు పాడరు' అంటాడు. అది నిజమే. నోరు విప్పకుండా వింటూ ఉండిపోయాము.

పాట ఆగిపోయింది.


కొంతసేపటి తర్వాత ఓ సవర కుర్రవాడు మా వైపు రావడం కనిపించింది.

మందిరానికి ఉత్తర ముఖంగా ఆరుబయట నేల మీద చాపలు వేసుకుని, అక్కడ కూచుని వింటున్న మా వేపు వస్తున్నాడు. మాకు తూర్పున ఒక గదిలో

పూజారి నూకయ్యగారు. ఆ గదిలో లాంతరు వెలుగు. ఆయన నిద్రపోయినట్టు లేదు. పాట వింటున్నట్టున్నారు.

"అగ్గిపుల్ల పెట్టి." అంతే వాడికి తెలిసిన తెలుగు.

వెన్నెల్లో మునిగి వచ్చినట్టుగా ఆ శరీరం మీద చందమామ అలంకారాలు. పద్దెనిమిదేళ్ళు కూడా ఉండదేమో ఆ వయసు. మొలకు గోచీ పెట్టి, గావంచా కట్టుకున్నాడు. ఒంటి మీద మరో గుడ్డ లేదు.



సత్యం ఇదే అదను అనుకున్నాడేమో తన దగ్గరున్న అగ్గిపెట్టెను తీసి ఇచ్చాడు. "ఇవి తీసుకో" అని తన బనీను జేబులో ఉన్న బీడీ కట్ట తీసి, ఆ కుర్రవాడికి ఇచ్చి వాని వెంట వాళ్ళున్న చోటుకు వెళ్ళాడు, అగ్గిపెట్టె వెనక్కి తెచ్చుకునే నెపం మీద. పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చి చెప్పాడు. మేము వాళ్ళున్న చోటుకు వెళ్ళకుండా ఇక్కడే ఉన్నట్టయితే పాడతారట. టేప్‌రికార్డ్ పెట్టెను వాళ్ళ దగ్గర విడిచిపెట్టి రికార్డ్ చేసుకోవటానికి ఒప్పుకున్నారట.

ఆ ఏర్పాటుతో ముద్దుకృష్ణ కోరిక తీరి సంతృప్తి చెందాడు. ఎటొచ్చీ శిరోమణి కోరిక తీరే అవకాశం లేదు.

టార్చ్‌లైట్ ఇచ్చి, టేప్‌రికార్డ్‌లో ఏది నొక్కి వాళ్ళ వైపు ఎట్లా పెట్టాలో వివరించి చెప్పి సత్యంని పంపించాము. సత్యం ఇట్లాంటివి ఒకసారి చెప్తే చాలు పట్టుకోగలడు.

ఆ ప్రశాంత వాతావరణంలో - మనక మనక వెన్నెల్లో రాత్రిపిట్టల అరుపుల నేపథ్యంతో ఆ పాట యువహృదయాల కన్నీటి ప్రేమలను ఆలాపిస్తున్నది. దాదాపు యాభై అరవై అడుగుల దూరంలో ఆ ఆదివాసి పడుచువాళ్ళ పాట అడవి గొంతు విప్పి పాడుతున్నట్టుగా ఉంది. ఆ భాష తెలీదు. ఆ పాట అర్థం తెలీదు. అయినా, సంగీత ప్రకంపనలతో గుండె పులకించిపోతున్నది. మనసు నిండా అటవీ ఓషధుల సువాసనలు. కొండ శిఖరాలను ముద్దు పెట్టుకుని వెళ్ళిపోతున్న గాలుల గలగల నవ్వు. కొండలోయల మధ్య నుంచి కాలం ప్రవాహపు కిలకిలలు. నాట్యాలు, స్వప్నాలు, వెన్నెల జల్లులు. చిన్నపిల్లల ఏడుపులాంటి పాట. ఆదిమ మానవుడి నుంచి యుగయుగాల వారసత్వంగా మిగిలిన తేనెపాట.

ఊపిరి బిగపట్టి వింటున్నాం.

చందమామ అస్తమించాడు. పాట ఆగిపోయింది. సత్యం వెళ్ళి ఆ టేప్‌రికార్డ్ వెనక్కు తెచ్చాడు. దాదాపు ఓ గంటసేపు సాగిందా పాట. మేమంతా ఇంకా ఆ తన్మయత్వంలోనే ఉన్నాం. వాళ్ళు నిద్రలోకి ఒరిగిపోయి నట్టున్నారు, చుక్కల చూపుల కింద, నేలతల్లి మట్టిచీరల మీద.


టేప్ సరిగ్గానే వచ్చింది.

అప్పుడు గొంతు విప్పాడు సత్యం.

పూజారి నూకయ్యగారికి సత్యం గొంతు వినిపించిందేమో నిద్రను చెరిపేసుకుని బయటికి వచ్చి గడపలో కూచున్నారు.

ఆ రాత్రి రెండు గంటల వరకు మాకు నిద్ర లేదు. సత్యం పల్లె పాటలని ముద్దుకృష్ణ టేప్ చేస్తున్నాడు. అవి మళ్ళీ విన్నాం.

* * *



వేకువజామున చిన్న చిన్న చినుకులతో వాన. మేము లేచి చాపలు తీసి టార్చి వెలుతురులో గది లోపలికి చేర్చి పరచుకుని మళ్ళీ పడుకున్నాం. ఆ వాన అలాగే కొంతసేపు పడేసరికి పొలం నుంచి సవరలు తమ గంపలతో, కావళ్ళతో వచ్చి పంచకింద చేరారు. ఆ పంచ ఇరుకు. తడుస్తున్నట్టున్నారు. సందడి విని లేచి నూకయ్యగారు వాళ్ళను గది లోపలకు పిలుచుకున్నారు. నిద్రపోవాలనుకున్నవాడిని ఆ సందడికి లేచాను. అవతల గదిలో లాంతరు వెలుగులో నులకమంచం మీద కూచున్న నూకయ్యగారు గోడకి వాల్చిన ఏకతారతో కనిపించారు. రెండు గదుల మధ్య ఇటుక గోడకి చిన్న గూడు. అట్నించి ఇటు - ఇట్నుంచి అటు చూట్టానికి వీలుగా లాంతరు పెట్టుకోవడానికి వీలయినంత చిన్నది. దాంట్లోంచి చూస్తే కనిపించిన దృశ్యమది. దగ్గరకు వెళ్ళి చూస్తే వాళ్ళంతా ఆ గదిలో బెరుకు బెరుకుగా నిలుచున్నట్టు కనిపించింది. వాన తగ్గుతుంది బయటకు పోవచ్చులే అన్నట్టు అంతా నుంచున్నారే తప్ప ఎవ్వరూ కూచోలేదు. పూజారిగారి నులకమంచం, ట్రంక్‌లు, ఓ మూల వంటపొయ్యి వంట గిన్నెలు, ఇతర బుట్టలు, మూటలతోగది సామాన్లతో నిండిపోయి ఇరుగ్గా ఉంది. చూరుకున్న ఇనుపతీగెకి వేలాడుతున్న లాంతరు.

"వాన తగ్గిన తర్వాత వెళ్ళొచ్చు కూచోండి" అని నూకయ్యగారు వాళ్ళను కూచోబెట్టారు. సత్యానికి నిద్ర పట్టినట్టు లేదు. లేచి బయటికి వెళ్ళి పక్క గదిలోకి దూరాడు.


ఉదయం మేము నిద్ర లేచేసరికి ఎనిమి దిన్నరయింది. ఎండ చురచురలాడుతున్నది బయట. నూకయ్యగారు స్నానం చేసి నుదుట పొడవాటి కుంకుమబొట్టు పెట్టుకుని, ఎర్రటి పట్టు పంచె కట్టుకుని మందిరం సావంచాల మీద కూచుని - బుట్టెడుపూలు ముందేసుకుని దేవి అలంకరణ కోసం నిలువెత్తు మాల కడుతున్నారు.

వేకువజామున వానకి సవరపిల్లలు నూకయ్యగారి గదికి వచ్చి వాన తగ్గేవరకు కూచుని వెళ్ళారని చెప్తే విని ముద్దుకృష్ణ చాలా బాధ పడ్డాడు. వాళ్ళను వాన తమ కాళ్ళ దగ్గరకు తెచ్చినప్పుడు తమ నిద్ర మూలంగా చూసే అవకాశం పోయిందే అన్నది ఆయన బాధ. తనను లేపవద్దా అంటాడు పదే పదే. సత్యం కోసం వెతికాడు. చీకటి తెల్లారక ముందే సత్యం ఇంటికి వెళ్ళిపోతాడు. ఇంటి పనులు

ముగించి మనకోసం వస్తాడన్నాను.

రాత్రి చెప్పినట్టుగా ఎనిమిదిన్నరకల్లా వండా మా కోసం ఉప్మా, కొబ్బరిచెట్నీ, సెనగ పిండితో చేసిన బంగాళదుంప కూర, పూరీలు విడి విడి గిన్నెల్లో పెట్టి, ఆకుల్లో కట్టి ఓ బుట్టతో పంపించాడు. ఆ తెచ్చిన పిల్లవాడు ఆ బుట్టను నూకయ్యగారికిచ్చి వెళ్ళిపోయి నట్టున్నాడు. నూకయ్యగారా సంగతి చెప్పి 'టీ చెప్పనా' అని అడిగారు. మేము పళ్ళు తోముకోవడానికి బ్రష్‌లూ, పేస్టులూ తీసి నూతి దగ్గరకు వెళ్ళాము. నూతి దగ్గర "సత్యం ఏడీ" అని మరోసారి అడిగాడు ముద్దుకృష్ణ.

'వాళ్ళను చూడాల్సింది. వాళ్ళ ఫొటోలు తీసుకోవాల్సింది. ఎంత గొప్ప అవకాశం తప్పి పోయింది' అన్నది శిరోమణి బాధ. నాకా దృష్టి లేదు. పైగా నాకు వాళ్ళు నిత్యం కనిపించే మనుషులు.



స్నానాలు ముగించాక దేవీపూజతో ఇవేళ్టి మా కార్యక్రమం మొదలు. మధ్యాహ్నం భోజనం చేసి బయటపడి వక్షుల కోనేరు, రాళ్ళగుట్ట, నెమళ్ళ అడవి చూసిరావాలని. రేపు కొండల్లోకి వెళ్ళి సవర గ్రామాలు చూసి, అక్కడ వాళ్ళ ఫొటోలు తీసుకుని రావటం. దొరికితే సవర సంగీత వాద్యాలు కొనుక్కోవాలని ముద్దుకృష్ణ ఆలోచన.

* * *

వక్షుల కోనేరు, రాళ్ళగుట్ట, నెమళ్ళ అడవి ఆ పూటంతా చూసి, చీకటి పడ్డాక అడవిలో ఎండుకట్టెలు పోగుచేసి మంటచేసి, చుట్టూ కూచుని సత్యంతో పాటలు పాడించుకున్నాం. ఢిల్లీ నుంచి తన మిత్రుల బృందాన్ని పంపించి దీన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించే కార్యక్రమానికి అంకురార్పణగా అర్ధగంట పొడవు డాక్యుమెంటరీ ఫిల్మ్ నిర్మించే ఏర్పాట్ల గురించి ముద్దుకృష్ణ తన ఆలోచనలు చెప్పాడు. శిరోమణికి చిలకల చెట్టు ప్రత్యేకమైన ఆకర్షణ అయింది. అక్కడే నాలుగు రీళ్ళు ఖర్చు చేశాడు. తన పత్రికలో వర్ణచిత్రాలతో నెమళ్ళ అడవి మీద తన వ్యాసం వస్తుందన్నాడు.

అక్కడ మరచిపోలేని అందం వక్షుల కోనేరని తీర్మానించాడు కామేశ్వరరావు. అక్కడో చిన్న గుడిసె వేసుకుని ప్రియురాలిని తెచ్చుకుని, ఈ అడవిలో బతికిపోవచ్చునట.

అందరూ దాన్ని అందాలదీవి అని ఒప్పుకున్నారు. వక్షుల కోనేరు, రాళ్ళగుట్ట, చిలకలచెట్టు, నెమళ్ళ అడవి పర్యావరణ సౌందర్య సముదాయంగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని, ప్రభుత్వ సహాయం జోలికి పోకుండా స్నేహితులమే దీన్ని అభివృద్ధిపరచాలనీ, ఈ అభివృద్ధి కోసం ఏయే సదుపాయాలు సమకూర్చుకోవాలో నిర్ణయించేందుకు నిపుణుల బృందాన్ని సంప్రతించాలని, ఆ మేరకు తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఒకరిద్దరు నిపుణులను ఇక్కడకు తీసుకురావడానికి శిరోమణి ఉత్సాహం చూపించాడు. విదేశీ పర్యాటకులను ఇక్కడకు తను పంపించగలడట ముద్దుకృష్ణ.

పట్టుదలతో కృషి చేస్తే నాలుగయిదేళ్ళలో దీన్ని ఒక పర్యాటక కేంద్రంగా రూపొందించ వచ్చునని అందరికీ నమ్మకం కలిగింది. సవరలు చేసుకునే అడవి దేవత పండుగ రోజును ఈ కార్యక్రమాన్ని ఆవిష్కరించే రోజుగా నిర్ణయించుకోవాలనుకున్నాం. చైత్రం నెల దినాల కిందటే వెళ్ళిపోయింది. పదకొండు నెలల తర్వాత అన్నీ సానుకూలిస్తే, ఈ కార్యకమానికి ప్రారంభోత్సవం జరుగుతుం దన్నమాట.

రాత్రి ఊరు చేరుకునేసరికి తొమ్మిదయింది. పండా ఇంట్లో భోజనం చేసి మందిరం చేరుకునేసరికి, ఏకతార మీద వీరబ్రహ్మంగారి తత్త్వాలు పాడుకుంటున్న నూకయ్యగారు మా రాక విని బయటికి వచ్చి "మీ ఉత్తరాలు" అని రెండు ఇన్‌లేండ్ ఉత్తరాలు నా చేతిలో పెట్టారు.

ఒకటి డూన్ నుంచి రామారావు రాసింది. కిందటి ఎండాకాలం మా అరకులోయ - పాడేరు యాత్ర గురించి తాను రాసిన వ్యాసం ఇంగ్లీషు దినపత్రికలో వచ్చిందట. ముస్సోరీ వెళ్ళి కిందటి నెల రస్కిన్ బాండ్‌ను కలిసి వచ్చాడట. ఈ వేసవిలో తాను తెలుగుదేశం రాబోవటం లేదట. గఢ్వాల్ పర్వత పంక్తుల్లో కాలినడకన తిరిగి రావాలనుకుంటున్న ఒక జట్టుతో తాను వెళ్తున్నాడట.

రెండో ఉత్తరం జాబిల్లిపేట నుంచి శాస్త్రి రాసింది.

సావిత్రమ్మగారు నెలదినాలు చేసిన ప్రయత్నాలు ఫలించటంవల్లనైతేనేమి, ఆ దంపతుల అదృష్టంవల్లనైతేనేమి ముత్యాలు కాపురానికి భర్త దగ్గరకు వెళ్ళటానికి అంగీకరించిందట. ఆ పిల్ల మనసు పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు సావిత్రమ్మగారు ఏం చెయ్యమంటే అది చేసేట్టుంది. వెంటనే సత్యంని పంపించు. శాస్త్రి క్లుప్తంగా రాసిన ఈ చిన్న ఉత్తరం శుభవార్తను మోసుకొచ్చింది.

మనసు సంతోషంతో, విజయానందంతో, ఆనందాశ్రువులతో సత్యం చెవిలో ఈ వార్త ఎంత త్వరగా వేద్దామా అని చూస్తోంది. ఈ సమస్య ఇంత త్వరగా, ఇంత అప్రయత్నంగా, ఇంత సులభంగా పరిష్కారం అవుతుందని నేను ఊహించ





లేదు. సావిత్రమ్మగారు నెలదినాలు చేసిన ప్రయత్న ఫలితమే కావచ్చు. కానీ, నాకు అప్రయత్నంగా జరిగినట్టే అనిపించసాగింది. సత్యంకి కాలం ఇన్నాళ్ళకు కలిసి వచ్చింది. సత్యం ఇప్పుడు వస్తాడు. ఈ రాత్రి మాతోనే ఉంటాడు. రేవంతా మాతోపాటే ఉంటాడు. ముద్దుకృష్ణ ఈ రాత్రి మరికొన్ని పాటలు టేప్ చేసుకుంటాడు. రేవంతా మాతోనే ఉంటాడా?

ఉంటాడా, ఈ మాట చెప్తే ఉదయమే జాబిల్లిపేట ప్రయాణం కట్టాడా?

ఏమైనా, ఈ శుభవార్త చెప్తే ఎగిరి గంతులేస్తాడని సత్యం రాకకోసం ఎదురుచూస్తున్నాను.

నిన్నటికన్నా వెన్నెల కొంచెమంత చిక్కబడింది. నూకయ్యగారు మా కోసం తన నులకమంచాన్ని వాకిట వెయ్యించారు. నా నర్సాపూర్ వాలుకుర్చీ, చాపలు కూడా.





బట్టలు మార్చుకుని వగటి నడక అలసట తీర్చుకోవటానికి అంతా వాకిట చేరాము. కామేశ్వరరావు రాసిన కొత్త నాటకం 'వీడ్కోలు' ప్రదర్శన గురించి ధర్మారావు ముచ్చట్లు చెప్తున్నాడు. ఒక్కొక్క మిత్రుడే ఉద్యోగాల పేరుతో, చదువుల పేరుతో ఊరు విడిచి పెట్టేసి వెళ్ళిపోతున్నప్పుడు ఊళ్ళో మిగిలిపోయిన నిరుద్యోగుల కథ ఆధారంగా రాసిన నాటకం.

అంతలో ముద్దుకృష్ణ నన్ను చేత్తో అందుకుని మందిరం వెనుక మందారాల తోట వేపు తీసుకుని వెళ్ళాడు.

"సంజీవ్, సత్యాన్ని నేను నాతోపాటు ఢిల్లీ తీసుకుపోవాలని నిర్ణయించుకున్నాను. ప్రపంచం వాడి కాళ్ళమీద పడేటంతటి మహాగాయకుడు సత్యం. అడవిగాచిన వెన్నెల్లా ఇక్కడ వదిలేయడం నాకు ఇష్టం లేదు. నేను తీసుకుపోవాలనుకుంటున్నాను. అయితే, ఇప్పుడే ఈ సంగతి ఊళ్ళో ప్రచారం కావద్దు. మనం వారం దినాల్లో ఢిల్లీ తిరుగు ప్రయాణం ముందు వచ్చి అప్పుడు చెప్పుదాం. ఇద్దరికీ రిజర్వేషన్ చేయించేస్తాను. ఈ నిర్ణయం నీ మనసులో ఉంచుకో. నూకయ్యగారితో కూడా చెప్పవద్దు. నాకు సహాయం చెయ్యి."

ముద్దుకృష్ణ సాయంత్రం పక్షుల కోనేరులో ధర్మారావు, కామేశ్వరరావు స్నానం చేస్తున్నప్పుడు, ఒడ్డున గట్టుమీద కూచున్నప్పుడు సత్యం కుటుంబ వివరాలు ఎందుకు అడిగాడో, నిద్ర లేచిన వెంటనే ఉదయం సత్యం పేరు పదే పదే ఎందుకు కలవరిస్తున్నాడో ఇప్పుడర్థమయింది నాకు.

"ఈ నిర్ణయం గురించి మన స్నేహితులతో చెప్పడం కూడా ఇష్టం లేదు నాకు. నువ్వు కూడా ఎవ్వరితో మాటవరసకన్నా అనవద్దు. వెళ్ళే ముందురోజు వచ్చి సర్పంచ్ నాయుడు గారితోనూ, వాళ్ళ అన్నతోనూ మాట్లాడుదాం. అయితే, అప్పుడు కూడా వాళ్ళకు మనం ఈ సంగీతం విషయం చెప్పనక్కర్లేదు. పని వాడిగా తీసుకుపోతున్నట్టు చెప్పటమే మంచిది. సాయంత్రం గమ్మత్తుగా సత్యంతో అన్నాను - 'నాతో ఢిల్లీ వచ్చేయ్ సత్యం, అని. 'వచ్చేస్తా' అన్నాడు గమ్మత్తుగానే. నాతో వచ్చేస్తాడు. నా దగ్గరే ఉంటాడు. రెండు మూడేళ్ళు వాడు సాధన చెయ్యాల్సి ఉంటుంది. కొందరు జన్మంతా తలకిందులు తపస్సు చేసినా దైవ ప్రసాదంగా వచ్చే ఆ కళ అబ్బదు. సత్యం రెండు మూడేళ్ళలో జాతీయస్థాయి గాయకుడవుతాడు. చదువు అయిదో తరగతే అని నిరుత్సాహం లేదు. ఆ సంగతి నేను చూసుకుంటాను."

ముద్దుకృష్ణ ఎవరో తెలీని ఓ పల్లెటూరు యువకుని కోసం ఇంత నిండుప్రేమతో, సంగీతం మీది పిచ్చితో, మనసులోని తియ్యటి కోరిక గురించి నాతో చెప్పి, నా సహాయం కావాలని వేడుకుంటుంటే, అది నా విజయమే అనిపించి ఒళ్ళు పులకరించింది. నెమళ్ళ అడవి అందం నాకు కనిపించిందిగాని, సత్యం గొంతులో ఉన్న అద్భుతం నాతో ఇన్నాళ్ళు ఉన్నా నాకు తెలీలేదు, సత్యం నిజమైన వజ్రమని.

సత్యం పెళ్ళి, పెళ్ళాం ముత్యాలు కాపురానికి రాకుండా కన్నవారింట ఉండిపోవడం, ఆ సమస్య పరిష్కారానికి నేను చేస్తున్న ప్రయత్నాలు సాయంత్రం ముద్దుకృష్ణకు నేను చెప్పినవే. ఇప్పుడు శాస్త్రి రాసిన ఉత్తరం గురించి ముద్దుకృష్ణకు చెప్పటమా, నాలోనే ఉంచుకోవటమా?

సత్యంని ఇప్పుడు జాబిల్లిపేట పంపించటమా, మానటమా? ఏదీ తేల్చుకోలేకపోతున్నాను. ఈ ఆలోచనలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఒక పక్క సంతోషం, మరోపక్క ముత్యాలు కనిపించి దుఃఖం.

సత్యాన్ని నా స్నేహితుడు, అమాయకుడైన సత్యాన్ని, నానుంచి ముద్దుకృష్ణ లాక్కుపోతున్నట్టు కూడా తల్లిపేగు లాంటి బాధ. నా నెమళ్ళ అడవినే ముద్దుకృష్ణ దోచుకుంటున్నట్టు బాధ. సత్యం నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతే నెమళ్ళ అడవి, పక్షుల కోనేరు, చిలకలచెట్టు, రాళ్ళగుట్ట ఏమవుతాయి? రోదించవా? ఆ లోటు తీర్చే వేరొకరు నాకు దొరుకుతారా?

ఈలోపు సత్యం పెళ్ళాం ముత్యాలు వచ్చేస్తేనో!

'రాకూడదు' అనుకున్నాను నిశ్చయంగా. సత్యాన్ని కళాదేవతకు కానుకగా దేశానికి సమర్పించడంలో ఉన్న గర్వం, సంతోషం నన్ను ఓదార్చాయి. ■